నేటి నుంచి ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల స్వీకరణ

చందానగర్: శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం నుంచి ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఉప కమిషనర్లు ముకుంద్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ఒకటి అన్నారు. జంట సర్కిళ్ల పరిధిలో ఉన్న నిరుపేదలకు, ఇళ్లు లేని వారికి నిరంతర ప్రక్రియలో భాగంగా సర్కిళ్ల పరిధిలోని వార్డు కార్యాలయాలలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఇళ్లు లేని వారు నిరాశ చెందకుండా తమతమ వార్డు కార్యాలయాలకు వెళ్లి దరఖాస్తులు తీసుకొని సమాచారాన్ని పొందుపరిచి అధికారులకు అందజేయాలన్నారు. నిరుపేదలు, ఇళ్లు లేని వారు ఎలాంటి నిరాశ చెందకుండా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వార్డు కార్యాలయాలలో సంబంధిత అధికారులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు.

వేడుకగా శ్రీవారి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

చందానగర్: శేరిలింగంపల్లిలోని గుల్‌మొహర్ పార్కు కాలనీలో శ్రీ పద్మావతి అలివేలుమంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌లు హాజరై స్వామి వారి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించి అన్నవితరణ కార్యక్రమం ప్రారంభించారు. మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు, గుల్ మోహర్ పార్కు కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

వేడుకగా వసంత పంచమి



రాయదుర్గం: వసంత పంచమి వేడుకలను గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని అన్నపూర్ణాదేవి అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు, అష్టోత్తర పూజలు, ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయంలోని గణేషుడు, కాశీ విశ్వేశ్వరస్వామి, షిరిడీ సాయిబాబా, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకారం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నారు.

మీనాక్షి మావెరిక్స్ ఆధిక్యం



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ ఐదో రౌండ్‌లో మీనాక్షి మావెరిక్స్ ఆధిక్యం సాధించింది. వూటీ గోల్ఫ్ కౌంటీలో జరిగిన పోటీల్లో మావెరిక్స్ టీమ్ 110 పాయింట్లతో టాప్ ప్లేస్‌లో నిలిచింది. ట్యూటోరూట్ 105 పాయింట్లతో రెండో స్థానం దక్కించుకుంది. లీగ్ రౌండ్ మ్యాచ్‌లు ముగియడంతో 8 జట్లు నాకౌట్ స్టేజ్‌కు అర్హత సాధించాయి. ప్రస్తుతం ఓవరాల్ లీడర్ బోర్డులో ట్యూటోరూట్ 719 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా...మీనాక్షి మావెరిక్స్ 710 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. గ్రూప్ ఏ నుంచి ట్యుటోరూట్ , రఫ్ రైడర్స్ , గ్రూప్ బి నుంచి మీనాక్షి మావెరిక్స్ , టీమ్ మైసా , గ్రూప్ సి నుంచి కళింగ వారియర్స్, టీమ్ ఆల్ఫా , గ్రూప్ డి నుంచి కాంటినెంటర్ వారియర్స్ , ఎంవైకే స్ట్రైకర్స్ నాకౌట్‌కు క్వాలిఫై అయ్యాయి.

పట్నంలో పల్లె జాతర



చందానగర్: నల్లగండ్లలోని అపర్ణ సరోవర్ పల్లె ఆకృతిగా కొలువైంది. మూడు రోజుల ప్రభల తీర్థం సంబరాలు సరికొత్త వన్నె తీసుకు రావడమే కాకుండా, ఆ సరికొత్తదనం పాత పల్లె విశేషాలతో ముచ్చటగా మూడు రోజులలో మధురంగా సాగింది. వారం రోజులుగా గుడిలో కొలువైన దేవుళ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిల్లలు పౌరాణిక వేషధారణలో ప్రభల ముందు నడుస్తూ ముచ్చటగా కనిపించారు. సరికొత్త ప్రభలపై విరాజిల్లిన శరభేశ్వరుడిని ఊరేగించారు.

అధికారుల నిర్ణయం... ఉపాధికి గ్రహణం!

ఐటీ కారిడార్‌లో ఫుట్‌పాత్ వ్యాపారాల తొలగింపునకు రంగం సిద్ధం

- ఇప్పటికే తొలగిస్తామని హెచ్చరించిన జీహెచ్‌ఎంసీ అధికారులు
- ప్రధాన రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉందని వెల్లడి
- జీవనాధారం కోల్పోతామంటూ చిరువ్యాపారుల ఆందోళన
- ప్రత్యామ్నాయం చూపించాలని వీధి వ్యాపారుల వేడుకోలు



న్యాయం చేయాలని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డిని కోరుతున్న నానక్‌రాంగూడ వీధి వ్యాపారులు

రాయదుర్గం: వీధి వ్యాపారులకు అధికారుల నిర్ణయం ఇబ్బందికరంగా మారింది. నానక్‌రాంగూడ ప్రధాన రోడ్ల పక్కన ఫుట్‌పాత్‌లపై పలువురు ఎన్నో ఏళ్లుగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సుమారు 60 కుటుంబాలకు చెందిన వారు వీధి వ్యాపారాలు చేస్తూ ఇదే జీవనం సాగిస్తున్నారు. వీరంతా నానక్‌రాంగూడ ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతం కోసం భూములు కోల్పోయిన రైతులే.

- భూములు కోల్పోయి మూడు దశాబ్దాలు కావస్తున్నా ఇప్పటి వరకు వారికి నష్టపరిహారం కూడా అందించలేదు. కానీ ప్రభుత్వానికి వేలకోట్ల ఆదాయం సమకూరింది. వారిలో కొంత మంది వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నా, మిగతా వారంతా వీధి వ్యాపారాలు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వీధి వ్యాపారాలను జీహెచ్‌ఎంసీ పరిధిలో 'మీ అంతట మీరే తొలగించుకుంటే సరి... లేదంటే జేసీబీలతో తొలగిస్తాము' అని అధికారులు హెచ్చరించి వెళ్లారు. దీంతో వీధి వ్యాపారుల్లో సర్వత్రా ఆందోళన నెలకొంది.

ఇబ్బందులు రాకుండా వ్యాపారాలు చేసుకుంటున్నామని పలువురు వీధి వ్యాపారులు వాపోతూ అధికారులు, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ చొరవ తీసుకొని తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

వీధి వ్యాపారుల సమస్యలు ఇవే...

ఇప్పటికే భూములు కోల్పోయామని ఇప్పుడు జీవనాధారం కూడా కోల్పోతే పూర్తిగా రోడ్డుపైకి కుటుంబాలు వస్తాయని నానక్‌రాంగూడవాసులు వాపోతున్నారు. తమకు ప్రత్యామ్నాయం చూపాలని కోరుతున్నారు.

- నానక్‌రాంగూడ శ్మశానవాటిక నుంచి అపోలో ఫార్మసీ వరకు ఉన్న రోడ్డులోనే ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. మిగతా అన్ని చోట్ల వీధి వ్యాపారాలు చేయరాదని అధికారులు హెచ్చరిస్తున్నారు
- కొందరు దళారులు వీధి వ్యాపారుల నుంచి అక్రమంగా వసూళ్లకు పాల్పడటం ఇబ్బందిగా మారింది.
- రోడ్లపై కొందరు అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేస్తూ సమస్య సృష్టించడంతోనే ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలి
- ఏళ్ల నుంచి వీధి వ్యాపారాన్నే జీవనాధారంగా కుటుంబ పోషణ చేసుకుంటున్నామని, మాకు ఇది తప్ప ఇంకో ప్రత్యామ్నాయం లేదని.. తమకు చదువు కూడాలేదని వాపోతున్నారు.

పేదలపై కనికరం చూపాలి



ఎనిమిదేళ్లుగా వీధి వ్యాపారాన్ని నమ్ముకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నా. వెంటనే తొలగించాలని హెచ్చరించడంతో ఏమి చేయాలో తోచడం లేదు. అధికారులు మాలాంటి పేదలపై కనికరం చూపాలి. ఇక్కడయితేనే వ్యాపారం సాగుతుంది. మరోచోట అయితే జీవనమే భారంగా మారుతుంది.

– గణేష్ పాన్‌షాప్, నానక్‌రాంగూడ

ఎక్కడికి వెళ్లాలి?



భర్త దివ్యాంగుడు. నేనే 15 ఏళ్లుగా వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని నడుపుతున్నా. ప్రస్తుతం తొలగించాలంటే ఎక్కడికి పోవాలి. ఏమి చేయాలో అర్థం కావడంలేదు. పేద కుటుంబాల పట్ల అధికారులు దయ చూపాలి. వ్యాపారం చేసుకోనివ్వాలి.

– కవితాబాయి, చిరువ్యాపారి, నానక్‌రాంగూడ

రోడ్లపై పార్కింగ్‌తోనే...



రోడ్డు పక్కన ట్రాఫిక్‌కు ఇబ్బంది రాకుండా వ్యాపారం చేస్తున్నాం. కొందరు తమ వ్యాపారాల కోసం వాహనాలను ఆపడంతోనే సమస్యలు వస్తున్నాయి. అది అందరిపై పడుతోంది. ట్రాఫిక్ సమస్య చెప్పి మా వ్యాపారాలను తొలగించడం కన్నా వాహనాలను నిలుపకుండా చూడాలి.

– నస్రీన్‌బేగం, చిరువ్యాపారి, నానక్‌నరాంగూడ

పేదలను ఆదుకోవాలి



పేద కుటుంబాలను అధికారులు, నాయకులు ఆదుకోవాలి. ఏళ్ల నుంచి ఈ వ్యాపారాలనే నమ్ము కున్నాం. ఇక్కడే గిరాకీలు సాగుతున్నాయి. ఎవరికీ ఇబ్బంది లేకుండా చేస్తున్నాం, అయినా మాపై అన్యాయంగా వ్యాపారాలు నిలిపివేయాలంటున్నారు. ఏమి చేయాలో తోచడం లేదు, అధికారులు, నాయకులు ప్రత్యామ్నాం చూపించి కుటుంబపోషణ భారం కాకుండా చూడాలి

– నితీషాసింగ్, చిరువ్యాపారి, నానక్‌రాంగూడ

భూములు కోల్పోయిన పేదలు



నానక్‌రాంగూడలో భూములు కోల్పోయిన కుటుంబాలలో నిరుపేదలవారు వీధివ్యాపారులు చేస్తున్నారు. వారికి ఇదే జీవనాధారం. తొలగించాలంటే ఎక్కడికి పోతారు. 60 కుటుంబాలు రోడ్డున పడతాయి. అందుకే మా కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ద్వారా అధికారులు కలిశాం. వారికి పూర్తిగా అండగా ఉంటూ న్యాయం చేసేలా చూస్తాం.

– శివాసింగ్, బీజేపీ గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు, నానక్‌రాంగూడ

ఉత్సాహంగా 'గ్రండే-2025' రన్



'గ్రాండే 2025' రన్‌లో పాల్గొన్న చిన్నారులు, మహిళలు, యువత



వసంత పంచమి సరస్వతి పూజ కార్యక్రమంలో పాల్గొన్న కమ్యూనిటీ సభ్యులు

చందానగర్: నల్లగండ్లలోని అపర్ణ గ్రాండే గేటెడ్ కమ్యూనిటీలో 'గ్రండే-2025' రన్ ఆదివారం ఉత్సాహంగా జరిగింది. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న ఆర్యోక్తి ప్రకారం ప్రతి సంవత్సరం కమ్యూనిటీ వాసులకు 3,5,10 కిలో మీటర్ల పరుగు పందేలను నిర్వహిస్తుంటారు. అన్ని వయసుల వారు సుమారు 600 మంది అత్యంత ఉల్లాసంగా పాల్గొన్నారు. అనంతరం జంబో నృత్యంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్ కుమార్, బాబీ రెడ్డి, ప్రశాంత్ పటేల్, నిశాంత్ పటేల్, విశ్వనాథ్, సచిన్, దీపక్, శాలిని పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి సరస్వతి పూజ

అపర్ణా గ్రాండే గృహ సముదాయంలో వసంత పంచమి పురస్కరించుకొని కమ్యూనిటీ సభ్యులందరు కలిసి సరస్వతి పూజను ఘనంగా నిర్వహించారు. దేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలందరు ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు.

గచ్చిబౌలిలో బీజేపీకి ప్రజాదరణ



బీజేపీలో చేరిన వారితో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లో బీజేపీకి రోజురోజుకూ ప్రజల నుంచి ఆదరణ పెరుగుతోందని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. గోపన్‌పల్లికి చెందిన మల్లేష్, నరేష్, ఎల్లేష్, ప్రవీణ్‌కుమార్ తదితరులు ఆదివారం గోపన్‌పల్లిలోని గంగాధర్‌రెడ్డి కార్యాలయంలో బీజేపీలో చేరారు. వారికి కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వాన్ని, కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఆకర్షితులై అన్ని వర్గాలకు చెందినవారు బీజేపీ పట్ల మొగ్గు చూపు తున్నారన్నారు. బీజేపీలో కొత్త, పాత అంతా కలిసి పార్టీ విజయమే లక్ష్యంగా అంతా కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. పార్టీ పటిష్టం కోసం కృషి చేసే వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. బీజేపీ నాయకులు సుమన్, విష్ణు, మల్లేష్, నరేష్, వంశీ, చిన్న, దేవేష్, మోహన్, విష్ణు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ ఎదుట భారీ ప్రదర్శన



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ప్రధాన గేటు సమీపంలో డప్పుల మోతలతో భారీ ప్రదర్శనను నిర్వహించారు. ఆదివారం డీఎస్‌యూ హెచ్‌సీయూ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఫిబ్రవరి 7న జరిగే 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే ప్రచారంలో భాగంగా ఈ డప్పుల మోత కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎస్‌యూ హెచ్‌సీయూ నాయకులు ఆర్.వేణు, శేఖర్, వర్ధన్, ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మద్దిలేటి మాదిగ, జాతీయ నాయకులు సత్యనారాయణ, శంకర్‌రావు, రాజు, బీఎస్‌ఎఫ్ అధ్యక్షుడు అంజి అర్రోళ్ల, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భానుప్రసాద్, శేరిలింగంపల్లి కన్వీనర్ ప్రేమ్‌కుమార్, హెచ్‌సీయూ నాయకులు, ఎంఆర్‌పీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అంబారీపై అభయాంజనేయ స్వామి

- ముగిసిన ఆలయ వార్షికోత్సవం
- ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన



కోలాటం నడుమ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని అంబారీపై ఊరేగిస్తున్న దృశ్యం

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని ఔటర్ రింగు రోడ్డు సర్వీస్ రోడ్డులో వెలిసిన అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా పుర వీధుల్లో స్వామివారిని అంబారీపై ఊరేగించారు. కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆంజేయుడిని కొలుస్తూ పాడిన పాటలు అందరినీ భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. నయనానందకరంగా స్వామివారి మూట్‌విరాట్‌ను అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, ఆకు పూజ, అభిషేకం, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ నిర్వాహకులు యాదవరావు, నర్సింగరావు, రమేష్, సహదేవ్, గోపాల్ పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న అర్చకులు, భక్తులు



ప్రత్యేక అలంకారణలో అభయాంజనేయ స్వామి


ఇష్టపడి చదివితే విజయం మీ వెంటే

మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

పటాన్‌చెరు: ప్రతీ విద్యార్థి ఇష్టపడి చదివితే విజయం మీ వెంటే వస్తుందని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విద్యార్థులకు హితబోధ చేశారు. పటేల్‌గూడలో ఆదివారం ఐఐటీ చుక్కా రామయ్య ఇష్టా జూనియర్ కళాశాల ఫేర్‌వెల్ డే వేడుకలకు ఐఐటీ ప్రొఫెసర్ హిమబిందుతో కలసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ...తల్లిదండ్రులు ఎంతో కష్టపడి తమ పిల్లల్ని చదివిస్తున్నారని వారు కూడా అంతే బాధ్యతగా చదువుకుని ఉన్నతస్థానాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఐఐటీ చుక్కారామయ్య ఇష్టా విద్యాసంస్థల చైర్మన్ కార్తీక్ కోట, డైరెక్టర్ వినోద్‌కుమార్, అకడమిక్ డీన్ ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్ దీప, సంగారెడ్డి బ్రాంచ్ ప్రిన్సిపాల్ రవికిరణ్‌రెడ్డి, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సరస్వతి పూజలో ఎమ్మెల్యే గూడెం

పటాన్‌చెరు: వసంత పంచమిని పురస్కరించుకుని బెంగాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పటాన్‌చెరు పట్టణంలోని బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పాతికేళ్లుగా స్థానిక బెంగాలీలు వసంత పంచమి రోజు సరస్వతీదేవి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను నిర్వాహకులు సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చందానగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో సోమవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- మాధవనగర్ ఫీడర్ పరిధిలో మాతృశ్రీనగర్ కొంత భాగం, ఎస్‌బీఐ, ఓల్డ్ సొసైటీ, మాధవనగర్ ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.
- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో ఓల్డ్ హఫీజ్‌పేట్, వార్డు కార్యాలయం, గ్రీన్ బావర్చి, సాయినగర్, యూత్ కాలనీ, రైల్వే స్టేషన్, హనుమాన్ టెంపుల్, నయార పెట్రోల్ పంప్ ఏరియాలలో విద్యుత్ నిలిపివేస్తామన్నారు.
- ఆదిత్యానగర్ ఫీడర్ పరిధిలో ఆదిత్యానగర్, కృష్ణ కాలనీ, ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్, ఎస్‌సీబీ కాలనీ, హనుమాన్ టెంపుల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో...

ఆదిత్యా ఇంపీరియల్ హైట్స్, మార్తాండనగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆదిత్యా ఇంపీరియల్ హైట్స్, మార్తాండనగర్ పూర్తి ఏరియాలలో విద్యుత్ ఉండదని ఏఈ దీప్తి పేర్కొన్నారు.

వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో...

భిక్షపతి ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కైలాష్‌నగర్, టెక్నో అపార్ట్‌మెంట్స్, జవహర్ కాలనీ రోడ్డు నెంబర్ 4, 5, 6లు, శ్రీదేవి థియేటర్ ఎదురుగా ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ శ్రీనివాస్‌రెడ్డి వివరించారు.

గచ్చిబౌలి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో...

గచ్చిబౌలి: గచ్చిబౌలి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ భాస్కర్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జైన్ హౌసింగ్ కాలనీ ప్రాంతంలో విద్యుత్ ఉండదన్నారు.

- గచ్చిబౌలి 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓల్డ్ గచ్చిబౌలి ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వివరించారు.

సెవెన్ హిల్స్ ఫీడర్ పరిధిలో...

మియాపూర్: నందమూరినగర్ బృందావన్ కాలనీ సెవెన్ హిల్స్ ఫీడర్ పరిధిలో పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ రవిచంద్ర తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హోలిస్టిక్ ఆస్పత్రి, నిజాంపేట్ మెయిన్ రోడ్డు, బృందావన్ కాలనీ, హైదర్‌నగర్ విలేజ్, నాగార్జున్ హోమ్స్, సెవెన్ హిల్స్ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ వివరించారు.

జాతర్లతో ఆధ్యాత్మిక వాతావరణం

మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్

పటాన్‌చెరు టౌన్: జాతర్ల నిర్వహణతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం చోటు చేసుకుంటుందని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల గ్రామ పరిధిలో ఆదివారం భ్రమరాంబిక సహిత మల్లికార్జున (గుండు మల్లన్న) జాతర మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు తలసానిని ఘనంగా సన్మానించారు. మల్లన్న దేవాలయం వద్ద నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని మాజీమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మల్లన్న ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నానన్నారు. మల్లన్న స్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నాగేష్, జాతర నిర్వాహకులు శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.